# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక




## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించిన కుటుంబ సభ్యులు

బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ తదితరుల నివాళి

4లో..


సంపుటి: 2 | సంచిక: 48 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 29 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## ప్రజాభవన్‌ను పేల్చేస్తాం

### ఆకతాయిల బెదరింపు కాల్‌గా గుర్తింపు

హైదరాబాద్, మే 28 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ బేగంపేటలోని ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు కాల్ కలకలం రేపింది. కాసేపట్లో ప్రజా భవన్ పేలిపోతుందంటూ  పోలీస్ కంట్రోల్ రూమ్‌కు మంగళవారం ఓ దుండగుడు ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ప్రజాభవన్‌లో ఎక్కడా బాంబు దొరకకపోవడంతో అది ఫేక్ కాల్‌గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్ చేసిన వ్యక్తిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు. చివరికి ఆ కాల్ ఆకతాయిల పనిగా గుర్తించారు. ఫేక్ ఫోన్ కాల్‌పై మంత్రి సీతక్క స్పందించారు. తాము ప్రజలకు స్వేచ్ఛగా ప్రజాభవన్‌లోకి వచ్చే అవకాశం ఇస్తే ఇలాంటివి జరుగుతున్నాయన్నారు. ఎవరైనా రావొచ్చని తాము ప్రజాభవన్ గేట్లు ఓపెన్ చేసి పెడుతున్నామని అన్నారు. కొందరు కావాలనే ఇలాంటి కాల్స్ చేసినట్లు వెల్లడించారు. ప్రజలు తాము కష్టాలను చెప్పుకునేందుకు ప్రజాభవన్‌లోకి అందర్నీ అనుమతిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం చెకింగ్ జరుగుతోందని.. వాస్తవాలు తెలుస్తాయని సీతక్క వ్యాఖ్యానించారు.



# తెలంగాణ అంటేనే త్యాగాలు, పోరాటాలు

### ఇక్కడ రాచరిక వ్యవస్థకు తావు లేనేలేదు

తెలంగాణ పోరాటం స్ఫురించేలా చిహ్నం

రాష్ట్రగీతం రూపకల్పన బాధ్యతలు అందెశ్రీకి అప్పగింత

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ, మే 28 (ప్రభాత ఉదయం): తెలంగాణలో రాచరిక వ్యవస్థకు తావులేదని, తెలంగాణ అంటే త్యాగాలు, పోరాటాలని, తెలంగాణ పోరాటాలు, చిహ్నాలు, తెలంగాణ తల్లి, గీతం స్ఫురించేలా తెలంగాణ చిహ్నం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన బాధ్యతలు కవి అందెశ్రీకి ఇచ్చామని, అందెశ్రీ ఎవరిని ఎంచుకుని గేయ రూపకల్పన చేస్తారనేది ఆయన ఇష్టమన్నారు. ఏ సంగీత దర్శకుడిని పెట్టి గేయ రూపకల్పన చేయాలనేది తనపనికాదన్నారు. రాష్ట్ర గేయ రూపకల్పన బాధ్యత అంతా అందెశ్రీ దేనని, తెలంగాణ చిహ్న రూపకల్పన నిజామాబాద్ వ్యక్తికి ఇచ్చామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. మేడిగడ్డ ప్రాజెక్టు వెన్నెముక ఇరిగిందని తాను ముందే చెప్పానని, గత ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి విడిచిందని, సముద్రంలో పోసిన నీళ్లకు కరెంట్ బిల్లు కట్టమని చెప్పారు. ఎన్నికల కోడ్ రాష్ట్రంలో ఉన్నందున ఫోన్ టాపింగ్‌పై సమీక్ష జరపలేదన్నారు. ఫోన్ టాపింగ్ అంశం అధికారులు చూసుకుంటు న్నారని, దానితో తనకు ఎలాంటి సంబంధం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్డ్ డిస్కులను ధ్వంసం చేశారని, అన్నింటిపై సీబీఐ విచారణ అడిగే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఫోన్ టాపింగ్‌పై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను ఫోన్ ట్యాపింగ్ చేయించడం లేదని, అలాంటి పనులు చేయనని స్పష్టం చేశారు. బ్యాకప్ డేటాకు సంబంధించిన హార్డ్ డిస్కులు ఫామ్ హౌస్‌లో ఉన్నాయో.. ఇంకా ఎక్కడ ఉన్నాయో విచారణ అధికారులు తేల్చాలని ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్ సమస్య, కోతలు లేవని, కొన్ని చోట్ల వర్షాల కారణంగా సదుపాయాలలో అవంతరాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పక్క రాష్ట్రంలో పోలీసు అధికారులందరినీ కూడా ఎన్నికల సమయంలో ట్రాన్స్‌ఫర్ చేశారని, తెలంగాణలో ఎలాంటి ట్రాన్స్‌ఫర్‌లు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఎలాంటి ఆరోపణలు చేయకుండా ఎన్నికలు జరిగాయని, స్వేచ్ఛాయుత వాతావరణంలో రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించామన్నారు. ఎక్కడ ..మిగతా 2లో



## ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో సంచలనం

### కెసిఆర్‌కు తెలిసే లిక్కర్ స్కామ్ వ్యవహారం కోర్టుకు తెలియచేసిన ఇడి

న్యూఢిల్లీ, మే 28 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో సంచలనం నమోదు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ స్కాం మొత్తం కేసీఆర్‌కు తెలిసే జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు కోర్టుకు చెప్పడం సంచలనంగా మారింది. ఢిల్లీలోని కేసీఆర్ అధికారిక నివాసంలో కవిత తన టీం సభ్యులను కేసీఆర్‌కు పరిచయం చేశారని.. ఈ సందర్భంగా లిక్కర్ వ్యాపారం గురించి వారి వద్ద నుంచి కేసీఆర్ అడిగి తెలుసుకున్నారని ఈడీ తెలిపింది. కవిత  బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో వాదనల సందర్భంగా ఈడీ కేసీఆర్ ప్రస్తావనను తీసుకు వచ్చింది.ఢిల్లీ అధికారిక నివాసంలోనే లిక్కర్ స్కాం భాగస్వాములను కేసీఆర్‌కు పరిచయం చేసిన కవిత.ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో కీలక నిందితుడుగా ఉన్న గోపీ కుమరన్.. ఈ స్కాంలో కేసీఆర్ పాత్రపై స్పష్టంగా రికార్డు చేశారని ఈడీ తెలిపింది. కేసీఆర్ అధికారిక నివాసంలో జరిగిన భేటీలో మద్యం వ్యాపారంలో వివరాలతో పాటు లంచంగా ఇచ్చిన డబ్బులు.. ఇతర వివరాల గురించి మాట్లాడుకున్నారని ఈడీ స్పష్టం చేసింది.

ఈడీ వాదనలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాలలోనూ సంచలనంగా మారనున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కాం వెలుగులోకి వచ్చినప్పటి నుండి ఎప్పుడూ కేసీఆర్ అనే పేరు ప్రస్తావన రాలేదు.  ఈ వ్యవహారం అంతా కేసీఆర్‌కు తెలియదనే అనుకున్నారు. కేసు బయటకు వచ్చిన తర్వాత ఓ సందర్భంలో కవితపై కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారని మీడియాలో ప్రచారం జరిగింది. అయితే ఈ కేసు విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా కవితకు అండగా నిలిచింది. న్యాయపరమన సాయం అందించింది. మొదట్లో ఈడీ విచారణకు పిలిచినప్పుడు అరెస్ట్ చేయకుండా న్యాయపరమైన అన్ని అవకాశాలను ఉపయోగించుకున్నారు. అన్నీ కేసీఆర్ కనుసన్నల్లోనే జరిగినప్పటికీ.. ఎప్పుడూ ఆయన పేరు తెర ముందుకు  రాలేదు. అనూహ్యంగా ఈడీ .. ఈ స్కాం గురించి మొత్తం ముందే కేసీఆర్‌కు తెలుసని వాదించడం అనూహ్యంగా మారింది. గోపికుమరన్ అనే నిందితుడు... ఎప్పుడో తన వాంగ్మూలంలో స్పష్టంగా రికార్డు చేసి ఉంటే ..మిగతా 2లో



## తారెత్తిస్తున్న ఎండలు

### భగభగమండిపోతున్న భానుడు

దేశ రాజధాని ఢిల్లీలో 48 డిగ్రీల ఉష్ణోగ్రత

7 రాష్ట్రాలకు రెడ్ అలర్ట్ జారీ.. జూన్ నుంచే భారీగా వర్షాలు

రుతుపవనాల రాకతో ముందస్తుగా వానలు

భారత వాతావరణ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, మే 28 (ప్రభాత ఉదయం): దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఎండలు తారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమండిపోతున్నాడు. ఇంట్లో నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఒకవైపు వేడి.. ఇంకోవైపు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఇక పిల్లలు, వృద్ధులు ఎండివేడిమికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలు రాష్ట్రాల్లో భారీ స్థాయిల్లో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో రాజధానిలో ప్రజలు హడలెత్తిపోతున్నారు. తాజా ఉష్ణోగ్రతల నేపథ్యంలో 7 రాష్ట్రాలకు కేంద్ర వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాజస్థాన్, పంజాబ్, హర్యానా, చండీఘర్, ఢిల్లీ, వెస్ట్ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో వచ్చే ఐదు రోజుల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసింది. విదర్భ, ఈస్ట్ ఉత్తరప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, జార?ండ్, ఒడిశా రాష్ట్రాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అవసరమైతే తప్ప ..మిగతా 2లో

## కేజ్రీవాల్‌కు సుప్రీం షాక్

### బెయిల్ పొడిగింపు అభ్యర్థన తిరస్కరణ



న్యూఢిల్లీ, మే 28 (ప్రభాత ఉదయం): ఢిల్లీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. తనకు మరో వారం రోజులపాటు మధ్యంతర బెయిల్ గడువు పొడిగించాలని కేజ్రీవాల్ పెట్టుకొన్నఅత్యవసర పిటిషన్‌ను సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ తోసిపుచ్చింది. జస్టిస్ జేకే మహేశ్వరి, కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం.. కేజ్రీవాల్ పిటిషన్‌ను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ పిటిషన్‌పై తదుపరి ఆదేశాల కోసం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్‌కు పంపుతున్నట్లు వెకేషన్ బెంచ్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది. మద్యం కుంభకోణం కేసులో మని లాండరింగ్ వ్యవహారంలో సీఎం కేజ్రీవాల్‌ను ఈ ఏడాది మే 21వ తేదీన ..మిగతా 2లో



2

## కీరవాణి వ్యవహారంతో నాకు సంబంధం లేదు

రాచరిక ఆనవాళ్లకు ఇక్కడ చోటు లేదు

రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

## పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన



### జయజయహే తెలంగాణ గీతం గురించి తెలుసా

రాముద్రలో మార్పులపై మండిపడ్డ కెటిఆర్

హైదరాబాద్, మే 28 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరు పిచ్చోడి చేతిలోరాయిలా తయారయ్యిందని, రేవంత్  పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే రాష్ట్ర గేయంలో మార్పులకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టగా, తాజాగా రాష్ట్ర రాజముద్రపై సైతం మార్పులు చేపడుతుండటంతో మాజీ మంత్రి కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పిచ్చోడి చేతిలో రాయిలాగా రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన ఉందంటూ కాంగ్రెస్ సర్కార్ పై విమర్శలు గుప్పించారు. ప్రముఖ కళాకారుడు అలె లక్ష్మణ్ రూపొందించిన రాష్ట్ర రాజముద్రలో ..మిగతా 2లో

# పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన

మొదటి పేజీ తరువాయి...

తెలంగాణ చరిత్రకి, సాంస్కృతిక వారసత్వానికి, గంగా- జమునా తహజీబుకి ప్రతీకలుగా కాకతీయ తోరణం, చార్మినార్ ఉండటం.. రాచరిక పోకడనట అంటూ అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర గీతంలో మాత్రం రాజముద్రలో ఉన్న చార్మినార్ గురించి 'గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్' అని పాడుకోవాలి అంటూ కేటీఆర్ సెటైర్లు వేశారు. 'కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప' అని అదే రాచరిక పరిపాలన గురించి ప్రస్తుతించాలి ! అసలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గాని, ఆయన మంత్రి వర్గంలో ఒక్కరికైనా రాష్ట్రగీతంలో ఏమున్నదో తెలుసా ? అని సోషల్ మీడియా వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. ఇదేం రెండునాల్కల వైఖరి..! ఇదెక్కడి మూర్ఖపు ఆలోచన అంటూనే కాకతీయ కళాతోరణంపై ఎందుకంత కోపం.. చార్మినార్ చిహ్నంపై ఎందుకంత చిరాకు అని కేటీఆర్ ప్రశ్నించారు. అవి రాచరికపు గుర్తులు కాదు.. వెయ్యేళ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలు అని, వెలకట్టలేని తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలు అని కేటీఆర్ పేర్కొన్నారు. జయజయహే తెలంగాణ గీతంలో ఏముందో తెలుసా ? కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప అని, గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే ఈ చార్మినార్ చిహ్నం. అధికారిక గీతంలో కీర్తించి.. అధికారిక చిహ్నంలో మాత్రం అవమానిస్తారా..? రెండు నాల్కల ధోరణి ఏంటని ప్రశ్నించారు. చార్మినార్ అంటే ఒక కట్టడం కాదు.. విశ్వనగరం హైదరాబాద్ కు ఐకాన్ అన్నారు. కాకతీయ కళాతోరణం అంటే ఒక నిర్మాణం కాదు.. సిరిసంపదలతో వెలుగొందిన ఈ నేలకు నిలువెత్తు సంతకం కానీ.. వాటిని రాష్ట్ర అధికారిక చిహ్నం నుంచి తొలగించడం అంటే.. తెలంగాణ చరిత్రను చెరిపేయడమే అని, 4 కోట్ల తెలంగాణ ప్రజల గుండెలను గాయపరచడమే అని కేటీఆర్ రాసుకొచ్చారు. కర్ణాటక అధికారిక చిహ్నంలోనూ రాచరికరపు గుర్తులు ఉంటే.. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని తొలగిస్తుందా చెప్పండి. భారత జాతీయ చిహ్నంలో అశోకుడి స్థూపం నుంచి స్వీకరించిన 3 సింహాలు ఉన్నాయి.. జాతీయ పతాకంలో ధర్మచక్రం ఉందని, వాటిని



ఏం చేయాలనుకుంటున్నారో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులనూ పూడ్చేస్తారా ? అసెంబ్లీని కూల్చేస్తారా ? నేడు తెలంగాణ గుర్తులు మారుస్తామంటున్నారు.. రేపు కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ సరిహద్దులూ చెరిపేస్తారా అని ఎక్స్ లో కేటీఆర్ ట్వీట్ చేశారు. గత పదేళ్లుగా తెలంగాణ ప్రభుత్వ అధికారిక చిహ్నంపై యావత్ రాష్ట్ర ప్రజల ఆమోదం ఉంది. సబ్బండ వర్ణాల మనసు గెలుచుకున్న సంతకం సైతం ఉందన్నారు. కానీ నేడు రాజకీయ ఆనవాళ్లను తొలగించాలన్న కక్షతో తెలంగాణ అధికారిక చిహ్నాన్ని చెరిపేస్తే సహించేది లేదని కేటీఆర్ హెచ్చరించారు. ఓరుగల్లు సాక్షిగా... మీ సంకుచిత నిర్ణయాలపై సమరశంఖం పూరించి, తెలంగాణ ప్రజల్ని ఏకం చేసి ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరికలు పంపారు.



## కీరవాణి వ్యవహారంతో నాకు సంబంధం లేదు

### రాచరిక ఆనవాళ్లకు ఇక్కడ చోటు లేదు
### రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 28 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్ర గీతంగా ఎంపిక చేసిన జయ జయహే తెలంగాణ అనే గీతాన్ని ప్రభుత్వం అధికారికంగా రికార్డు చేయిస్తున్న సంగతి తెలిసిందే. దీనికి టాలీవుడ్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అయితే కీరవాణి మూలాలు ఆంధ్ర ప్రాంతానికి చెందినవి కావడంతో ఈ విషయం మీద ట్రోలింగ్ జరుగుతోంది. తెలంగాణ ఆత్మగౌరవంగా భావించే రాష్ట్ర గీతానికి ఒక ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తి ఎలా మ్యూజిక్ ఇస్తారు అనే విషయం మీద సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించిన వారు మీడియా ద్వారా సోషల్ మీడియా ద్వారా ఈ విషయాన్ని ఖండిస్తున్నారు. అయితే ఇప్పటికే రికార్డింగ్ సెషన్స్ కూడా మొదలైనట్లుగా ప్రచారం జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయం మీద స్పందించారు. తెలంగాణ అంటేనే రాచరికానికి వ్యతిరేకం, రాచరిక ఆనవాళ్లకు ఇక్కడ చోటు లేదు అని అన్నారు. రాటాలు గుర్తొచ్చేలా చిహ్నం, గేయం రూపొందిస్తున్నాం అని అన్నారు. రాజముద్ర రూపకల్పన బాధ్యత ఫైన్ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్‌కు ఇచ్చామని, తెలంగాణ గేయానికి సంగీతం సమకూర్చడం సహా మొత్తం వ్యవహారాన్ని అందె శ్రీకే అప్పగించాం అని అన్నారు. కీరవాణి వ్యవహారంతో నాకు సంబంధం లేదు, ఎవరితో సంగీతం చేయించుకోవాలనేది అందెశ్రీ దే తుది నిర్ణయం అని రేవంత్ రెడ్డి అన్నారు. ఇక అందెశ్రీ ఫోన్ కాల్ గా చెబుతున్న ఒక ఆడియో రికార్డ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవు తుంది. అందులో అందెశ్రీ కీరవానికి అవకాశం ఇచ్చిన వ్యవహారం మీద ఆయనను ఒక యువకుడు ప్రశ్నిస్తున్నట్లుగా కనిపిస్తోంది. అయితే ఆ యువకుడికి తనదైన శైలిలో అందెశ్రీ సమాధానం కూడా ఇస్తున్నారు. మరి ఈ అంశం మీద అందెశ్రీ స్పందిస్తారా లేదా అనేది చూడాల్సి ఉంది.



## తెలంగాణ అంటేనే త్యాగాలు, పోరాటాలు

మొదటి పేజీ తరువాయి...

కూడా అధికార దుర్వినియోగం చేశామని ప్రతిపక్షాలు సైతం ఆరోపణలు చేయలేదన్నారు. కాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ అవతరణ దినోత్సవం కార్యక్రమానికి హాజరుకావాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి ఆహ్వానం పంపించారు. అయితే ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఈ కేసుపై ఇంకా ఎలాంటి రివ్యూ చేయలేదన్నారు. ఇటు మేడిగడ్డపై జ్యుడిషీయల్ విచారణ నివేదిక తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే చాలా విషయాలు చర్చించేది ఉందని చెప్పారు. కాళేశ్వరం కరెంటు బిల్లులు అన్ని సముద్రం లో వదిలిన నీళ్లల్లాంటివని విమర్శించారు. 52 టీఎంసీల నీళ్లు సముద్రం పాలు అయ్యాయని చెప్పారు.తెలంగాణ లో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఆత్మ, ఉద్యమ స్ఫూర్తి, ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా రాష్ట్ర అధికారిక చిహ్నం తయారవుతోందన్నారు. అధికారిక చిహ్నంపై చిత్రకారులు రుద్ర రాజేశంతో సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఆయన నివాసంలో చర్చించారు. ఈ సందర్భంగా పలు నమూనాలను ఆయన పరిశీలించారు. తుది నమూనా ఎలా రావాలన్న అంశంపై సూచనలు చేశారు.



## ఢిల్లీ లిక్కర్ స్కాంలో మరో సంచలనం

మొదటి పేజీ తరువాయి...

ఇప్పటి వరకూ ఏ దశలోనూ ఆ విషయాన్ని కోర్టులకు చెప్పడం లేదా.. మరో విధంగా బయటకు తెలిసేలా చేయకపోవడం రాజకీయవర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. ఈడీ ఆషామాషీగా కేసీఆర్ ప్రస్తావన తీసుకు వచ్చి ఉ ండదని.. ఖచ్చితంగా ఆయనను ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయని అందుకే కోర్టు ముందు పెట్టారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మార్చి పదిహేనో తేదీన ఈడీ అధికారులు కవితను అరెస్టు చేశారు. అప్పట్నుంచి జైల్లోనే ఉన్నారు. బెయిల్ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా కేసీఆర్ పేరు బయటకు రావడంతో బీఆర్ఎస్‌లోనూ గందరగోళం ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది.

## కేజ్రీవాల్‌కు సుప్రీం షాక్

మొదటి పేజీ తరువాయి...

ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆయన తీహాడ్ జైలుకు తరలించింది. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన పార్టీ తరఫున ప్రచారం నిర్వహించు కోవాలంటూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో మే 10వ తేదీ కేజ్రీవాల్‌కు కండిషన్లతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఆ క్రమంలో జూన్ 2వ తేదీన మళ్లీ లొంగిపోవాలని కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే తనకు అనారోగ్య సమస్యలు ఉన్నాయని.. దీంతో తనకు మరో వారం రోజుల బెయిల్ పొడిగించాలంటూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జస్టిస్ జేకే మహేశ్వరి, కేవీ విశ్వనాథన్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ పై విధంగా స్పందించింది.



## తారెత్తిస్తున్న ఎండలు

మొదటి పేజీ తరువాయి...

బయటకు వెళ్లొద్దని స్పష్టం చేసింది.విదర్భలో రాబోయే 5 రోజులు పొడి వాతావరణం ఉ ంటుందని.. మరి కొన్ని నగరాలు 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. విదర్భలో 47.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగ్‌పూర్‌లో 45.6 డిగ్రీల సెల్సియస్‌ను తాకింది. గత పదేళ్లలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కావడం ఇదే. అకోలా, అమరావతి, యావత్మాల్‌లో ఉష్ణోగ్రతలు దాదాపు 45 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా సాధారణ రుతుపవనాలు ముందే వస్తున్నాయి.. దీని వల్ల ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖతెలిపింది. ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని రాష్ట్రాల్లో రుతుపవనాల ప్రభావం తక్కువగా ఉండవచ్చని ఐఎండీ అధికారులు చెప్పుకొచ్చారు. జూన్, సెప్టెంబర్ మధ్య దేశవ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, జమ్మూ కాశ్మీర్, లడఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లోని గంగా ప్రాంతం, దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఈశాన్య రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని చీఫ్ చెప్పారు. కాగా, జూన్- సెప్టెంబర్ మధ్య సగటు (ఎల్‌పీఏ)లో 106 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి చీఫ్ మృత్యుంజయ్ మహపాత్ర తెలిపారు. ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ ఉ త్తరప్రదేశ్ సహా వాయువ్య భారతదేశంలో సాధారణ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇక, వర్షాధార వ్యవసాయ రంగంలో కూడా సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇందులో రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, జార?ండ్, ఒడిశా రాష్ట్రాలు ఉన్నాయి.జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ మధ్య దేశం మొత్తం 87 సెంటీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు అవుతుందని ఐఎండీ చీఫ్ మహపాత్ర చెప్పారు. మధ్య భారతం, దక్షిణ ద్వీపకల్పంలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. నైరుతి రుతుపవనాలు దక్షిణ, తూర్పు మధ్య బంగాళాఖాతంలోని చాలా ప్రాంతాలకు విస్తరించాయని పేర్కొన్నారు. రాబోయే ఐదు రోజులలో రుతుపవనాలు దక్షిణ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలోని కొన్ని ప్రాంతాల్లో ఈశాన్య రాష్ట్రాలలోకి ప్రవేశించడానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పాడుతాయి.

## మనవరాలిపై 60 ఏళ్ల వృద్ధుడు పాశవికం

### సంచలన తీర్పు ఇచ్చిన పోక్సో కోర్ట్

విశాఖ, మే 28 (ప్రభాత ఉదయం): సమాజంలో రోజురోజుకీ విలువలు దిగజారిపోతున్నాయి. కామంతో కళ్లు మూసుకుపోయిన కొందరు ఎంతకైనా బరితెగిస్తారు. వావి వరసలు మరిచి మృగాల్లో వ్యవహరిస్తున్నారు. తాజాగా ఇలాంటి ఓ మానవ మృగానికే స్పెషల్ పోక్సో కోర్ట్ సంచల తీర్పు ఇచ్చింది. పోక్సో కేసులో విశాఖ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు చెప్పింది. మనవరాలు పై అత్యాచారం చేసిన పాపానికి ఆరుపదుల తాత కు ఇరవైయ్యేళ్ళ జైలు శిక్ష ఖరారు చేసింది. జైలు శిక్షతో పాటు అయిదు లక్షల జరిమానా విధించింది స్పెషల్ పోక్సో కోర్ట్. వివరాల్లోకి వెళితే.. విశాఖ మల్కాపురంకు చెందిన బాలిక తన తల్లిదండ్రులతో పాటు నానమ్మతాతయ్యలతో కలిసి రెండు అంతస్తుల భవనంలో నివసిస్తున్నారు. ఇదే సమయంలో బాలిక తరచూ రెండో అంతస్తులో తన తాత గారి ఇంట్లో చదువుకుంటూ ఉండేది. ఇదే సమయంలో కంటి రెప్పలా చూడాల్సిన 60 ఏళ్ల వి.శ్యామ్ సుందర్ (చిన్నారి తాతయ్య) చూపు చిన్నారిపై పడింది. కనీసం మనిషిననే విషయాన్ని కూడా మరిచిపోయి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంట్లో చెబితే చంపేస్తానని బెదిరిచ్చాడు. ఇలా పలుమార్లు లైంగిక దాడి చేశాడు. తల్లికి విషయం తెలియడంతో బాలికను ప్రశ్నించింది. దీంతో తనపై జరిగిన అన్యాయాన్ని ఆమె.. వివరించింది. విషయాన్ని ఎవరికైనా చెప్తే ఇంట్లో అందరినీ చంపేస్తా అని బెదిరించడంతో ఎవరికి చెప్పలేదని చెప్పి ఆవేదన చెందింది. దీంతో ఒక్కసారిగా కోపానికి గురైన తల్లి వెంటనే.. మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో చార్జ్ షిట్ ఫైల్ చేశారు. నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు, రూ. 5 లక్షల జరిమానా విధించింది.

# పిల్లలను విక్రయించే ముఠా అరెస్ట్

### ఢిల్లీ, మహారాష్ట్ర నుంచి పసిపిల్లల కొనుగోలు
### ఇప్పటి వరకు 50 మంది పిల్లల విక్రయం
### 11 మంది పిల్లలను శిశు విహార్‌కు అప్పగింత
### 8 మంది అరెస్ట్, పరారీలో ముగ్గురు
### తెలుగు రాష్ట్రాల్లో సంతానంలేనివారికి విక్రయాలు



హైదరాబాద్, మే 28 (ప్రభాత ఉదయం): హైదరాబాద్ ఇతర రాష్ట్రాల నుంచి పసిపిల్లలను కొని హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలలో విక్రయిస్తున్న ముఠాను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఆర్ఎంపీతో ఎనిమిది ఉన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను విచారణలో అంతరాష్ట్ర పసిపిల్లల విక్రయాల గుట్టు రట్టయ్యింది. మంగళవారం హైదరరాబాద్ నెరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 22న మేడిపల్లి పోలీసులకు పసిపిల్లల విక్రయాలపై వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ ఐతే శోభారాణి, ఉప్పల్ ఆదర్శనగర్‌కు చెందిన స్వప్న, రామకృష్ణానగర్‌కు చెందిన సలీం పాషాను అరెస్టు చేశారు. వీరు హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల్లో పిల్లలు లేని వారితో ఒప్పందాలు చేసుకొని రూ. 1.8 లక్షల నుంచి రూ. 5.5 లక్షల వరకు పసిపిల్లలను విక్రయిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఢిల్లీ, పుణెల నుంచి పసిపిల్లలను కొని తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలోని పిల్లలు లేని వారికి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆర్ఎంపీ డాక్టర్ శోభారాణి ముఠాలో అన్నోజిగూడకు చెందిన సెక్యూరిటీ గార్డు బండారి హరిహర చేతన్, అతని తల్లి బండారు పద్మ, విజయవాడకు చెందిన బల్గం సరోజ, ముదావత్ శారద, ముదావత్ రాజు, పఠాన్ ముంతాజ్, జగన్నాథం అనురాధ, చర్లపల్లికి చెందిన యాత మమత ఉన్నట్టు గుర్తించి మంగళవారం ఈ 8 మందిని అరెస్ట్ చేశారు. ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణెకు చెందిన కన్నయ్య అక్కడి నుంచి పిల్లలను ఈ ముఠాకు సరఫరా చేస్తున్నట్టు గుర్తించారు. ఇప్పటి వరకు ఈ ముఠా 50మంది పసిపిల్లలను రెండు తెలుగు రాష్ట్రాలలో విక్రయించినట్టు గుర్తించారు. అందులో 11మంది పసిపిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో సమన్వయం చేసుకొని రెస్క్యూ చేసి, శిశువిహార్‌కు అప్పగించినట్టు సీపీ వెల్లడించారు. బండారి పద్మ, బల్గం సరోజ, ముదావత్ శారదలపై ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలోనూ కేసులు ఉన్నాయని సీపీ తెలిపారు. ముంబయిలో నమోదైన కేసులో శారద పరారీలో ఉందని సీపీ వెల్లడించారు. పిల్లలను కొనుగోలు చేయడం నేరమని, దత్తత తీసుకోవాలనుకునే వారు అధికార వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి తెలిపారు. ఇదిలా ఉంటే పోలీసులు పసిపిల్లలను శిశు విహార్‌కు తరలిస్తుంటే కొన్న తల్లిదండ్రులు కమిషనరేట్‌కు చేరుకొని రోదించారు.

# ఎన్‌టీఆర్ యుగ పురుషుడు



ఎన్‌టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న సామ భూపాల్ రెడ్డి, తదితరులు



ఉప్పర్‌పల్లిలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న సామ భూపాల్ రెడ్డి

## సామ భూపాల్ రెడ్డి

బుద్వేల్, మే28(ప్రభాత ఉదయం): ఈతరంలోని ప్రజల్లో నుంచి పుట్టుకొచ్చిన దేవుడు లాంటి వ్యక్తి, యుగ పురుషుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి అన్నారు . ఎన్టీఆర్ 101 వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్ పల్లి లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జెండా ఎగరవేశారు. నగరంలోని ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వెళ్లి ఆయన సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సామ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్టీ రామారావు మహా మనిషి అని, మనుషుల్లో దేవుడు లాంటి వ్యక్తి అని కొనియాడారు. భూమిపై సూర్య చంద్రులు ఉన్నంత వరకు ఆయన పేరు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉంటుందన్నారు. సమాజమే దేవాలయం.... ప్రజలే దేవుళ్ళు అనే నమ్మిన మహోన్నతమైన వ్యక్తి ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. ప్రజలలో నుంచి దేవుళ్ళు పుట్టుకొస్తారని నమ్మిన వ్యక్తి ఎన్టీఆర్ అని, మహాభారతంలో శ్రీకృష్ణుడు మనుషుల్లో నుంచి వచ్చిన దేవుడని, రామాయణంలో శ్రీరామచంద్రుడు మనుషుల నుంచి పుట్టుకొచ్చిన దేవుడని, మహారాష్ట్రలో ఉన్న షిరిడి సాయిబాబా మనుషుల్లో నుంచి పుట్టుకొచ్చిన దేవుడని గుర్తు చేస్తూ, అలాంటి కోవకు చెందిన వ్యక్తి ఎన్టీరామారావు అని ఆయన కూడా మనుషుల్లో నుంచి పుట్టుకొచ్చిన దేవుడు లాంటి వ్యక్తి అని కొనియాడారు. బలహీన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. నేడు గల్లి నుంచి ఢిల్లీ వరకు కొనసాగుతున్న సంక్షేమ పథకాలు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టినవే నన్నారు. పేదరిక నిర్మూలన, బీసీలకు రాజ్యాధికారం , మహిళా సాధికారత, కార్మిక శ్రేయస్సు, రైతు సంక్షేమం, గ్రామాభ్యుదయం, యువత భవిష్యత్తు కోసం పాటుపడ్డ రాజకీయ సంస్కర్త ఎన్టీఆర్ అని కొనియాడారు . ఎన్టీఆర్ భావితరాలకు ఆదర్శ ప్రాయుడన్నారు . ఆయన ఆశయాల సాధన కోసం నిరంతరం పాటు పడతామని సామ భూపాల్ రెడ్డి గుర్తు చేశారు.



మీడియా నుద్దేశించి మాట్లాడుతున్న సామ భూపాల్ రెడ్డి



మణికొండ లోని రంగారెడ్డి డిటిసి కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు


## రంగారెడ్డి డిటిసి కార్యాలయంపై కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు

### క్రియాశీల పాత్రను ఏజెంట్ల వ్యవస్థ పోషిస్తున్నట్లు గుర్తింపు..

### నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిన అధికారులు..

గండిపేట,మే 28(ప్రభాత ఉదయం): రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మణికొండ ఆర్టిఓ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల సందర్భంగా కార్యాలయం ఆవరణలో ఉన్న విజిటర్స్ను బయటకు పంపి గేట్లకు తాళాలు వేశారు. అనంతరం సిబ్బందిని అదుపులోకి తీసుకొని పలు రికార్డులను పరిశీలించి లోపాలను గుర్తించారు. గత కొంత కాలంగా మణికొండ ఆర్టీఏ కార్యాలయంలో ఆర్టీఏ సేవలపై ఏజెంట్ల ఆగడాలపై ఫిర్యాదులు వస్తుండటంతో అధికారులు దాడులు చేసినట్లు వినికిడి మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతి రికార్డును అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. కార్యాలయం లోపల తనిఖీలు జరుగుతుండగా కార్యాలయం బయట టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సోదాల్లో అధికారుల వద్ద నిక్షిప్తమైన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో అధికారులు చేసిన లోపాలను గుర్తించారు. తనిఖీలు నిర్వహించే సమయంలో సుమారు 15 మంది (ఏజెంట్ల)ని గుర్తించినట్లు తెలుస్తుంది. స్థానికంగా ఏజెంట్ల వ్యవస్థ పని చేస్తుందని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ ఏజెంట్ల ద్వారా తమ పనులు చేయించుకుంటూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలో అవినీతి నేపథ్యంలో ఉద్యోగులు,అధికారులు, ఏజెంట్ల పాత్రలపై సమగ్ర నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలుస్తుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



రాజేంద్రనగర్, మే 28(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఉప్పరపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు ఉప్పరపల్లి, గాంధీనగర్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, ఓల్డ్ ఆర్టిఏ ఆఫీస్ ప్రాంతాలు వాంబే కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం నాలుగున్నర వరకు వాంబే కాలనీ, హనుమాన్ టెంపుల్, ప్రీతం ఎంక్లేవ్, ఐ సి బి ఎం కాలేజ్ ,సన్రైస్ హోమ్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హోతిరాం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### ఇబ్రహీం బాగ్ సెక్షన్ లో...

ఇబ్రహీం బాగ్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ తీగల కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి తుల్జీరామ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు అల్కాపూర్ రోడ్డు నెంబర్ 22 నుండి 30 వరకు, అల్కాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటలకు నుండి మూడున్నర గంటల వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 14 నుండి 22 వరకు, లాంకో విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు అల్కాపూర్ రోడ్ నెంబర్ 1 నుండి 13 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

### నార్సింగి సెక్షన్లో...

నార్సింగి విద్యుత్ సెక్షన్ పరిధిలోని బృందావన్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు బృందావన్ కాలనీ , నామన డాబా విజేత గండిపేట్ ప్రధాన రహదారి విస్టింగ్, లెజెండ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు నుండి మూడున్నర వరకు లెజెండ్ చిమ్మెస్, శ్రీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల నుండి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు ఇష్ట ఊర్జిత విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ రెడ్డి తెలిపారు.

### శంషాబాద్ లో...

శంషాబాద్ విద్యుత్ ఫీడర్ మధురానగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం రెండు నుండి సాయంత్రం నాలుగున్నర వరకు, ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు కోత్వాల్ గూడ, ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్ ఆర్కే టౌన్షిప్ లో 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శంషాబాద్ మిషన్ కాంపౌండ్ ,ఓల్డ్ హుడా కాలనీ, సంపత్ నగర్ మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆదర్శనగర్, శ్రీనివాస కాలనీ ,రిజిస్ట్రేషన్ ఆఫీస్ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు.

### షాపూర్ సెక్షన్ లో...

షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని గండిగూడ విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు షాపూర్ పారిశ్రామిక విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించటానికి గండిగూడ ,షాపూర్, గన్స్మియగూడ,ఆటోనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విద్యుత్తు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రతినిధులు

## అట్టడుగు వర్గాలకు రాజకీయ, సామాజిక చైతన్యం తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్

కొత్తకోట, మే 28(ప్రభాత ఉదయం) అట్టడుగు వర్గాలను సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసిన ఘనత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకి దక్కిందని దేవరకద్ర నియోజకవర్గం ఎన్టీఆర్ ఫ్యాన్స్ నాయకులు జనార్ధన్, కిషన్ నాయక్ లు అన్నారు. మంగళవారం సినీ నటుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి 101 జయంతి సందర్భంగా కొత్తకోట పట్టణంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రతినిధులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ ప్రతినిధులు జనార్దన్, కిషన్ నాయక్ లు మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రంలో ప్రజల్లో చైతన్యం తెచ్చి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు సంక్షేమ పథకాలు అంటే ఎన్టీఆర్ అనే విధంగా మార్పు తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనార్ధన్ సాగర్, జనార్దన్ గౌడ్, శ్రీరాములు నాయి, జగ్గన్న ,చంద్రమోహన్ భాస్కర్ ,కానాయిపల్లి శ్రీనివాసులు, తోట సత్యనారాయణ, ఆంజనేయులు ,అంజి, ఎస్ ఈశ్వరయ్య, భాస్కర్, రవీందర్ , పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



ట్యాంకు బండ్ వద్ద సాహితీవేత్త సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

## బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి జయంతి : మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

కొత్తకోట, మే 28(ప్రభాత ఉదయం) బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి అని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రాజకీయ,సాంఘిక చైతన్యం అంటే వెంటనే గుర్తుకు వచ్చే పేరు సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్ నగరంలోని ట్యాంక్ బండ్ పై గల సురవరం ప్రతాపరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... సాహితీవేత్తగా,పత్రికా సంపాదకుడుగా, పరిశోధకుడుగా, పండితుడుగా, రచయితగా, ప్రేరకుడుగా, క్రియాశీల ఉద్యమకారుడుగా బహుముఖాలుగా సాగిన ప్రతాపరెడ్డి ప్రతిభ, కృషి అనన్యమైన దని కొనియాడారు. కొత్తకోట పట్టణంలో జరిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గం మొదటి శాసనసభ్యులు సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ , ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు గంగు మాధవ రెడ్డి , ఉపాధ్యక్షులు బోరింగ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కొత్తకోట పట్టణ కేంద్రంలో సురవరం ప్రతాపరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# కాటేదాన్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా బ్రహ్మోత్సవాలు



కాటేదాన్ శ్రీ వెంకన్న కొండ పై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామీ దేవాలయంలో పూజలు



పూజలలో వేద పండితులు



వెంకటేశ్వర స్వామీ

బుద్వేల్, మే28(ప్రభాత ఉదయం) : కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీలోని వెంకన్న కొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగ జరుగుతున్నాయి. ప్రతి రోజు వందల సంఖ్యలో భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటున్నారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆరాధన సేవా కాలం , విశ్వక్సేన ఆరాధన లతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు నారసింహే స్తీ నిత్యావహనం పూజలు నిర్వహించారు. ప్రతిరోజు పూజా కార్యక్రమాలు కనుల పండుగ జరుగుతున్నాయి.

### విద్యుత్ కాంతులతో విలసిల్లుతున్న దేవాలయ పరిసరాలు :

కాటేదాన్ లో ఎత్తైన ప్రదేశంలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుత్ కాంతులతో విలసిల్లుతోంది. ప్రశాంతమైన వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.

### నేడు ....

మూడవ రోజైన బుధవారం
స్వామివారి జన్మనక్షత్రమైనటువంటి శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని
ఉదయం 6 గంటలకు స్వామివారికి పంచామృత కలశాభిషేకం,
రోజువారి హవన కార్యక్రమాలతో పాటు
సాయంకాలం 5 గం 30 నిమిషాలకు
శ్రీనివాసుడి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా
కన్నుల పండుగ జరుగుతుందని దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు.
భక్తులందరూ ఈ యొక్క కళ్యాణ మహోత్సవంలో పాల్గొని
అనంతరం
స్వామివారి పల్లకి సేవ లోపాల్గొని తరించి
కళ్యాణానంతరం జరిగే అన్నదాన కార్యక్రమం లో స్వామివారి కళ్యాణ
విందు ను ఆరగించి
తీర్థప్రసాదలు స్వీకరించి
తరించగలరని కోరారు.

# తెలుగు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి
# ఎన్టీ రామారావు





మాజీ సీఎం ఎన్టీఆర్ కు నివాళులర్పిస్తున్న నాయకులు

### తెదేపా సీనియర్ నాయకులు అట్లూరి దీపక్

కూకట్‌పల్లి, మే 28 (నమస్తే ఉదయం) తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఏకైక వ్యక్తి నందమూరి తారక రామారావు అని తెదేపా సీనియర్ నాయకులు అట్లూరి దీపక్ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 101 వ జయంతిని పురస్కరించుకొని, కే పి హెచ్ బి డివిజన్ తెదేపా సీనియర్ నాయకులు అట్లూరి దీపక్ ఆధ్వర్యంలో జే ఎన్ టి యు సర్కిల్ లోని ఎన్ టి ఆర్ విగ్రహానికి పూలమాల వేసిఘనంగా నివాళులర్పించారు. అనంతరం కే పి హెచ్ బి 114 డివిజన్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో, కే పి హెచ్ బి ఫేజ్-3 రమ్య గ్రౌండ్ తెదేపా దిమ్మె వద్ద ఎన్ టి ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, కేక్ కటింగ్ చేశారు. అనంతరం స్వీట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు షేక్ సత్తార్, శివ సత్యనారాయణ, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, కొల్లూరి శ్రీనివాస్, కాకర్ల గోపికృష్ణ, జాస్తి రమాదేవి, చంద్రరావు, చిరుమామిళ్ళ ఉమ, నారాయణరావు, రాజా, కే వి ఆర్ చౌదరి, కిషోర్ కేతినేని, ఆనందరావు, సాంబశివరావు, చెరుకూరి రవి, కంచర్ల శ్రీను, శ్రీను, దొరబాబు, మదన్మోహన్, పవన్ మార్ని, అట్లూరి ప్రవీణ్, ఆర్ కే మోరంపూడి, శివ, నాని, హేమంత్, నవీన్, శివ చౌదరి, సునీత, పవన్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ సీఎం స్వర్గీయ ఎన్టీఆర్ జయం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

## ప్రజల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన మహనీయుడు ఎన్టీఆర్

### బిజెపి నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు స్వర్గీయ మాజీ సిఎం ఎన్టీ రామారావుకు నివాళులు అర్పించిన నాయకులు

కూకట్‌పల్లి, మే 28 (ప్రభాత ఉదయం) ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా మంగళవారం వివేకానందనగర్ కాలనీ కమాన్ ఆవరణలో వివేకానందనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు ఏర్పాటు చేసిన జయంతి వేడుకలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో రాజకీయ చైతన్యం తెచ్చిన ఎన్టీఆర్ మహనీయుడని, సామాన్య ప్రజలకు ప్రశ్నించే తత్వాన్ని అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలను నెరవేర్చే విధంగా మందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మండి బిర్యానీ తిని కుటుంబమంతా ఆస్పత్రి పాలు

### షాద్‌నగర్‌లో ఫ్యామిలీ రెస్టారెంట్ ఘటన



షాద్‌నగర్, మే 28(ప్రభాత ఉదయం): ఫంక్షన్, ఈవెంట్ ఏదైనా సరే.. బిర్యానీ చాలా కామన్ అయిపోయింది. పుట్టినరోజు, పెళ్లిరోజులకే కాదు.. ప్రమోషన్ వచ్చినా బిర్యానీనే.. క్రికెట్ లో ఫేవరెట్ టీమ్ గెలిచినా బిర్యానీనే. పరీక్షలు పాసైతే బిర్యానీ.. ఫెయిలైనా ఆ బాధలోనూ బిర్యానీనే తింటున్నారు. ప్రతిదానికి బిర్యానీనే తింటుండటానికి తోడు.. కుప్పలు తెప్పలుగా బిర్యానీ సెంటర్లు వెలిశాయి. నాణ్యత లేని ఆహారం, వ్యాపారంలో లాభమే ప్రధాన ధ్యేయంగా.. నిల్వ ఉంచిన, కుళ్లిన ఆహారాలను పెడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. తాజాగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో ఒక కుటుంబం మండి బిర్యానీ తిని అనారోగ్యం పాలైంది. పెళ్లిరోజును సెలబ్రేట్ చేసుకునేందుకు ఓ వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఒక ఫ్యామిలీ రెస్టారెంట్ కు వెళ్లాడు. అక్కడ అందరూ మండి బిర్యానీ ఆర్డర్ చేసి తిన్నారు. అంతా బానే ఉంది. కానీ కొద్దసేపటికే వారందరికీ వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి. ఎలాగొలా ఆస్పత్రిలో చేరారు. అప్పరెడ్డిగూడా గ్రామం కావాలి నరేందర్ కుటుంబానికి ఎదురైన పరిస్థితి ఇది. మే 22న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బుధవారం రాత్రి 9 గంటలకు నరేందర్ తన ఫ్యామితో కలిసి షాద్ నగర్ లో ఉన్న సాయిబాబా ఫ్యామిలీ రెస్టారెంట్ కు వెళ్లి.. ఎంచక్కా మండి బిర్యానీ తిన్నారు. అక్కడి నుంచి ఇంటికి వెళ్తుండగా.. వరుసగా ఒక్కొక్కరికి వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వెంటనే శంషాబాద్ లో ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. నరేందర్ కు రక్తపు వాంతులు, విరేచనాలు కావడంతో ఐసీయూలో చికిత్స తీసుకుంటున్నాడు. నరేందర్ సహా 8 మంది.. భార్య మంగమ్మ, దీక్షిత, తన్విక, అనిరూద్, అభిలాష్, జోష్ణ, సాయి, శ్రీకర్ లు అస్వస్థతకు గురయ్యారు. వారందరికీ చికిత్స చేసిన వైద్యులు ఫుడ్ పాయిజన్ అయినట్లు తెలిపారు. నాణ్యత లేని ఆహారం తిన్నందునే అస్వస్థతకు గురైనట్లు నిర్ధారించారు. బయట రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లలో ఆహారం తినే ముందు ఒక్కసారి ఆలోచించాలని సూచించారు. చవక ధరకే వస్తుంది కదా అని ఎక్కడపడితే అక్కడ ఆహారం తింటే.. ఇలా ఆస్పత్రి పాలై లక్షలకు లక్షల రూపాయలు బిల్లులు కట్టాల్సిన పరిస్థితి వస్తుంది.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్

## కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలను ఎవరు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్
### ప్రజా పాలన, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం

కూకట్‌పల్లి, మే 28 (ప్రభాత ఉదయం): పార్టీ నియమ నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా తగిన క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బ%శీ%డి రమేష్ హెచ్చరించారు. ప్రజా పాలన, అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. మంగళవారం బాలనగర్ లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యక్రమాలను అభివృద్ధికి తీసుకునే చర్యలను వివరించారు. జేఎన్టీయూ హైటెక్ సిటీ రహదారిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం మెట్రో రైల్ ఏర్పాటు కాని స్కై బస్సు ఏర్పాటు గాని చేయాలని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని చెరువులను కబ్జాదారుల నుండి కాపాడుతామన్నారు. వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గ%శీ% అభివృద్ధి కోసం రూ 10 కోట్లు విడుదల అయ్యాయని, ఎన్నికల కోడ్ ముగియగానే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ నిధులను అధికంగా రోడ్లు, పాఠశాలల అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. త్వరలో కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ జరుగుతుందన్నారు. అందరి అభివృద్ధి ధ్యేయంగా ప్రజా పాలన లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. కొందరు నాయకులు పార్టీ పేరు చెప్పి వసూళ్ల దందాకు తెర లేపారని ఇలాంటి వారిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందని, వారిని పార్టీ సస్పెండ్ చేస్తుందని రమేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, నాగిరెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి దినేష్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎంపీటీసీ చింతపల్లి బాబు రెడ్డి, లక్ష్మీల కు వివాహ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్

## మాజీ ఎంపీటీసీ చింతపల్లి బాబు రెడ్డి, లక్ష్మీ దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

కొత్తకోట, మే 28(ప్రభాత ఉదయం): మాజీ ఎంపీటీసీ, కొత్తకోట పట్టణ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు చింతలపల్లి బాబు రెడ్డి , లక్ష్మి ల వివాహ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం బాబు రెడ్డి, లక్ష్మి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా వివిధ పార్టీల నాయకులు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బాబు రెడ్డి దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వారిలో కొత్తకోట ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్,మాజీ సర్పంచ్ ఎద్దుల నాగేష్, గ్రామ అధ్యక్షులు రామచంద్ర యాదవ్, నాయకులు కృపాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, దూత మన్యంకొండ, కావలి రమేష్, సీఎం మన్యంకొండ ,శివా చారి, కొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు







## ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించిన కుటుంబ సభ్యులు
### బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ తదితరుల నివాళి

హైదరాబాద్, మే 28(ప్రభాత ఉదయం): దివంగత నటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101 జయంతి వేడుకలు తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరిగాయి. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు, టీడీపీ నేతలు నివాళులర్పించారు. ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, ఆయా పార్టీల నాయకులు ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వచ్చి పుష్పాంజలి ఘటించారు. నందమూరి బాలకృష్ణ, పురంధేశ్వరి, జూనియర్ ఎన్టీఆర్, సహా ఇతర కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు వచ్చి నివాళులర్పించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండ వేసి నమస్సులర్పించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. తెలుగువారి ఘనకీర్తి.. తెలుగువారికి స్ఫూర్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నందమూరి రామకృష్ణ ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళురల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా అన్న అని పిలిపించుకున్న ఏకైక నేత ఎన్టీఆర్ అని రామకృష్ణ పేర్కొన్నారు. దాతల సాయంతో తిరుమలలో నిత్య అన్నదానానికి ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని అన్నారు. సంక్షేమ పథకాలతో పేదల జీవితాలను మార్చిన నేత ఎన్టీఆర్ అని కీర్తించారు. రాజకీయాలకు సరికొత్త నిర్వచనం చెప్పిన నేత ఎన్టీఆర్ అని దుగ్గుబాటు పురందేశ్వరి అన్నారు. ఎన్టీఆర్‌తోనే తెలుగువారి సత్తా ప్రపంచానికి తెలిసిందన్నారు. సంక్షేమానికి నాంది పలికిన నాయకుడు ఎన్టీఆర్ అని.. ఎన్టీఆర్ అంటే సినీ, రాజకీయ రంగంలో ప్రభంజనం అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకు వెళతామన్నారు. ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నేతలు కూడా ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకుని నివాళురల్పించారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద రఘురామకృష్ణం రాజు నివాళులర్పించారు. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ విజయం సాధించబోతోందన్నారు. ఏడు రోజుల్లో ఏపీలో టీడీపీ అధికారం చేపట్టబోతోందన్నారు. తనకు ఊహ తెలిసినప్పటి నుంచి తాను ఎన్టీఆర్ అభిమానిని అని అన్నారు. 1991లో ఎన్టీఆర్‌ను కలసిన సందర్భం తన జీవితంలో మధురమైన క్షణాలు అని రఘురామ పేర్కొన్నారు. ఎన్టీఆర్ మాదిరి మానవత్వం ఉన్న నేతలు శతాబ్దంలోనే లేరన్నారు. రాజకీయాల్లో ఎన్టీఆర్‌ది అతిపెద్ద స్థాయి అని.. ఎన్టీఆర్‌కు కేంద్రం భారతరత్న ఇచ్చి గౌరవిస్తోందన్న నమ్మకం తనకుందన్నారు. అంబేద్కర్, పూలే మాదిరి.. ఎన్టీఆర్ జయంతిని కూడా రెండు రాష్ట్రాలప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని రఘురామ డిమాండ్ చేశారు. టీడీపీ నేత కంభంపాటి రామ్మోహనరావు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. జూన్ 4న ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందన్నారు. ఏపీలో అధికారంలోకి వచ్చాక తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీకి గౌరవం ఉండేలా చూస్తామన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి కంభంపాటి విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ 101 జయంతి సందర్భంగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, ఎర్రబెల్లి దయాకర్రావు, కాట్రగడ్డ ప్రసూన, బక్కిన నరసింహులు తదితరులు నివాళులర్పించారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన ఎర్రబెల్లి దయాకర్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్‌ను గొప్పతనాన్ని స్మరించుకున్నారు. ఎన్టీఆర్‌కు కేంద్రం భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ తనకు దైవ సమానులు అని.. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన నాయకుడు అని అన్నారు. తాను మెదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకినని.. 25 ఏళ్ళ వయస్సుకే తనకు ఎన్టీఆర్ వరంగల్ జిల్లా పార్టీ పదవి ఇచ్చారని అన్నారు. ఎన్టీఆర్ ఆశీర్వాదంతోనే 26 ఏళ్ళకే తాను ఎమ్మెల్యేగా పోటీ చేశానని ఎర్రబెల్లి చెప్పుకొచ్చారు. ఎన్టీఆర్ తెలుగువారికి గర్వకారణం అని.. పెన్షన్లు, కిలో రెండు రూపాయల బియ్యం పరిచయం చేశారని కీర్తించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని చెప్పుకొచ్చారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.